
# నాకో సవతి కావాలి!



-తోపుగంట మస్తాన్‌బాబు

నాక్కూడా ఓ సవతి ఉంటే ఎంత బాగుండును! అప్పటికది ఏడోసారి నేనలా అనుకోవడం!

పొద్దున్న మా పక్కింట్లో జరిగిన గొడవ విన్నప్పట్నుంచి, ఆ ఆలోచన నా మనసులో అలా పదే పదే మెదిలి నన్ను నలిబిలి చేయసాగింది.

అవును మరి. అలా అనిపించకుండా ఎందుకుంటుంది? "మీ రెండో పెళ్లానికైతే మా పక్కింటి సీతారత్నం ఉదయాన నెలకో చీర కొంటారు. నా మొహానికి ఏడాదికొకటైనా కొని చావరు... ఛా.. మీతో సంసారం చేయడం కన్నా ఎందులోనన్నా దూకి చావడం మేలు.." అని ప్రారంభించి మొగుడ్ని ఎంతగా సతాయించిందో నేను చెవులారా విన్నాను.

మా వారూ ఉన్నారు - దేనికి? ఆ సీతారత్నం మొగుడు చలపతి ఒట్టి చలిమిడి ముద్దలాంటి వాడు. జండాకొయ్యలా సన్నగా ఉంటాడు. జుట్టు ముళ్లపంది వెంట్రుకల్లా ఉంటుంది. చప్పిడి ముక్కు, చొట్టబుగ్గలు, కారునలుపు. పోనీ చేసేదేమయినా గొప్ప ఉద్యోగమా అంటే అదీ కాదు.. జస్ట్ రికార్డ్ అసిస్టెంట్.. ఎల్.డి.సి. క్యాడర్‌కన్నా తక్కువే. అలాంటివాడే పెళ్లానికో సవతిని తెచ్చిపెట్టాడు.

మా వారు నేచెబితే నమ్మరేమోగానీ, అచ్చం సినిమా హీరోలా ఉంటాడు. బ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేస్తున్నారు.

వెధవది అన్నీ మంచి గుణాలే ఆయనకి. మందుకొట్టరు, సిగరెట్లు కాల్చరు, కనీసం వక్కపొడి అయినా తినరు. ఎంతో స్వీట్‌గా మాట్లాడుతారు. ఎప్పుడూ నవ్వుతూనే ఉంటారు.

అసలీ మనిషికి కోపం అనే పదానికి అర్థం తెలుసా అనిపిస్తూంటుంది నాకు. అంత సౌమ్యశీలి. మా నాన్న కట్నం తాలూకు బకాయి ఇంకా ఓ యాభైవేలివ్వాలి.

దాన్ని గురించి కనీసం ఎప్పుడూ తల్చుకున్న పాపాన కూడా పోరు. ఒక్కోసారి నేనే గుర్తు చేస్తుంటాను.

"పోనిద్దూ.. కలిగినప్పుడు మీ నాన్నే ఇస్తారు. మనం ఒత్తిడి చేయడం ఏం బాగుంటుంది?" అనేస్తూ ఉంటారు తేలిగ్గా.

నేనంటే ఎంత ప్రేమో చెప్పలేను.

కాలు కింద పెడితే కందిపోతానేమోనన్నంత అబ్బురంగా చూసుకుంటారు నన్ను. నాకు చీరల పిచ్చీ, నగల పిచ్చీ లేనే లేదు. అయినా సరే తన దగ్గర డబ్బులున్నప్పుడల్లా నేను అడక్కపోయినా సరే తెచ్చి పడేస్తూంటారు.

నాకు వంట ఏవంత బాగా రాదు. అయినా సరే నా వంటని మెచ్చుకుంటూ తింటారు. 'నీ వంటకే మోయ్ బ్రహ్మాండం' అని ఉబ్బేస్తుంటారు పైగా.

ఆయన్లో భర్తనన్న అహంకారం ఏ కోశానా కనిపెంచదు నాకు.

అవసరమైతే చీపురు పట్టుకుని ఇల్లు ఊడ్చేయడానిక్కూడా సిద్ధమే. అంతగా సహాయపడుతుంటారు నాకు ఇంటి పనిలో. అలాంటి మనిషితో ఎలా వేగడం? ఆయన నన్నెప్పుడూ పన్నెత్తు మాట అనరు. తనని అనే అవకాశం నాకెప్పుడూ ఇవ్వరు.

ప్రేమ... ప్రేమ... ప్రేమ...

ప్రేమ అనే జడివానలో నిలువెల్లా తడిపేస్తుంటారు నన్ను.

నేనెంత ఘోరమైన తప్పు చేసినా పట్టించుకోరు.

ఐరన్ చేస్తూ కొత్త షర్టుని కాల్చేసినా, అజాగ్రత్త వల్ల అక్వేరియంని పగలగొట్టేసినా, వారానికి నాలుగుసార్లు అన్నం మాడ్చేసినా... ఏం చేసినా... కోపం రాదాయనకి.

"పోనీలే డియర్" అనేస్తారు తేలిగ్గా.

ఏమిటి పోనిచ్చేది?! జీవితమన్నాక. తీపి, పులుపు, వగరు, చేదు, కారం ఇలా అన్ని రుచులూ ఉండాలిగా!

అంతేగానీ పద్దాక ప్రేమ తీపిలో మునగిపోతే ఎలా?

మొగుడూ పెళ్లాలన్నాక అప్పుడప్పుడూ పోట్లాడుకుంటుంటేనే అందం చందం. బంధం.

అబ్బే! ఆ మనిషి కనీసం చిలిపి కయ్యాలక్కూడా చోటివ్వరే... అసలాయన మూర్తీభవించిన శాంతమూర్తిలాగా ఉంటారు.

అదేమాట అంటే నవ్వేసి ఊరుకుంటారు.

"మనం సరదాగానైనా ఒకసారి పోట్లాడుకుంటే బాగుంటుందేమోనండీ..." అని ఒకసారి నేనంటే.

"మనం పోట్లాడుకోవడమా? ఎందుకూ? నెవ్వర్! జరగదది..."

అలాంటి మనిషితో ఎలా వేగాలి చెప్పండి?

సీతారత్నం మొగుడు నయం. పైకి చలిమిడి ముద్దలా కనిపించినా, మనిషి వికారంగా ఉన్నా పెళ్లానికో సవతిని తెచ్చి పెట్టాడు ఎంచక్కా. ఆమెని నాక్కూడా ఓ సవతుంటే ఆమెని దృష్టిలో పెట్టుకుని ప్రతీరోజూ కాకపోయినా అప్పుడప్పుడు నాకు గుబులు మళ్లినప్పుడల్లా ఆయనతో పోట్లాడే దాన్ని కదా?

ఛ్...నాకా అదృష్టం ఎక్కడిది?

నేను నిట్టూర్పుస్తూంటే... "ఏమిటోయ్ 'ఛ్' అంటున్నావ్? ఏమైంది? తలనొప్పా? మాత్ర తేనా?" అని అడిగాడాయన.

నేను నవ్వుతూ నా మనసులోని ఉద్దేశాన్ని స్పష్టంగా బయట పెట్టాను.

"సో నీకో సవతి కావాలన్న మాట. సారీ డియర్ నాకలాంటివి చేతకావు."

నేను గోముగా, కినుకగా చూశాను.

"సరేలే బాధపడకు. అంతగా కావాలంటే నువ్వే ఒక సవతిని వెతికి పెట్టు.." అన్నారాయన ఆప్యాయంగా నన్నల్లుకుపోతూ.

నేనే వెతికి పెట్టాలట!! హవ్వ! అలాంటి మనిషితో నేనెలా వేగాలో మీరే చెప్పండి?!

★